28122024-DIS-04_Layout 1 12/28/2024 4:03 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# విమర్శలనే మెట్లుగా మలుచుకున్న మౌనముని

సురభి వాణిదేవీ
శాసనమండలి సభ్యురాలు

**మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఢిల్లీ ఎయిమ్స్‌లో గురువారం పరమపదించారనే వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలుపుతున్నా. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు క్యాబినెట్‌లో ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ దేశ చరిత్రలో తనదైన, చెరగని ముద్రవేశారు. సరళీకృత ఆర్థిక విధానాలతో మౌనంగా, ఎలాంటి ప్రచారాలు, ఆర్భాటాలు లేకుండా దేశ గతిని మార్చారు. ఆరు దశాబ్దాల పాటు దేశానికి అనేక స్థాయుల్లో సేవ చేసిన మన్మోహన్‌సింగ్‌కు ప్రతి భారత పౌరుడు రుణపడి ఉంటాడు.**

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న మన్మోహన్‌సింగ్ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పాఠాలు బోధించి ఎందరినో ఆర్థికవేత్తలుగా తీర్చిదిద్దారు. అంతే కాదు, వాణిజ్య పరిశ్రమల శాఖకు సలహాదారుగా ఉంటూ, ప్రధాన ఆర్థిక సలహాదారుగా కూడా సేవలందించారు. ఆ తర్వాత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్‌గా కూడా ఎనలేని సేవలు చేశారు. దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన ఎన్నడూ పదవుల కోసం వెంపర్లాడలేదు. మన్మోహన్‌సింగ్‌కు ఉన్న పరిజ్ఞానం, అనుభవాలను చూసి పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రి పదవి కూడా ఆ తరహాలో వచ్చిందే. ఏ పార్టీలో వీసమెత్తు సభ్యత్వం కూడా లేని మన్మోహన్‌సింగ్‌కు దేశ ఆర్థికమంత్రి పదవి దక్కడం విశేషం.

మన దేశం అనేక ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయం అది. ఆపత్కాలంలో ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మన్మోహన్‌సింగ్.. ప్రమాదపుటంచున ఉన్న దేశ ఆర్థికవ్యవస్థను తన మేధోసంపత్తితో గాడిలో పెట్టారు. తద్వారా ఆర్థిక సంక్షోభం నుంచి దేశం గట్టెక్కింది. లైసెన్స్ రాజ్యానికి తెరదించి సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన ఆయన ఆర్థిక రంగానికి జవసత్వాలు అందించారు. అప్పటి ప్రధాని పీవీ సహకారంతో ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ చేపట్టిన చర్యల కారణంగా విదేశీ పెట్టుబడులు, పరిశ్రమలు వెల్లువలా వచ్చాయి. దాంతో దేశం అతివేగంగా అభివృద్ధి చెందింది. రోజూ 16 గంటల పాటు పనిచేసే మన్మోహన్‌సింగ్‌కు అలుపు, అలసట అనేవే తెలియవు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవ చేసిన ఆయన ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం పొందారు. 2004లో మొదటిసారి ప్రధానమంత్రి పదవిని అలంకరించిన ఆయన 2004-09 మధ్యకాలంలో ప్రజారంజక పాలనను అందించారు. తద్వారా ప్రజామోదం పొంది 2009లో మరోసారి ప్రధాని పీఠాన్ని అధిరోహించారు.

> పరస్పర విరుద్ధ భావాలు కలిగిన రష్యా, అమెరికాలతో మన దేశ సంబంధాలు ఏ మాత్రం చెక్కుచెదరకుండా కాపాడటం మన్మోహన్‌సింగ్ చతురతకు నిదర్శనం.

అలాగే సర్వశిక్షా అభియాన్, పనికి ఆహారం, సమాచార హక్కు లాంటి వినూత్న పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది. మౌనాన్నే తన బలంగా చేసుకొని, ప్రతిపక్షాల విమర్శలను మెట్లుగా మలుచుకొని ఉత్తమ ఆర్థికమంత్రిగా, ప్రధానిగా సేవలందించిన ప్రాతఃస్మరణీయుడు మన్మోహన్‌సింగ్. ఆయన అస్తమయం భారతావనికి తీరని లోటు.

**(మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళిగా..)**

# ఉనికి కోసం కాంగ్రెస్ ఉరుకులాట

**'ఉనికిని కాపాడుకోవాలా? పూర్వవైభవం సంపాదించడానికి దారులు వెతకాలా?'.. భారత పూర్వ పాలకపక్షం కాంగ్రెస్ పార్టీని ఇప్పుడు పీడిస్తున్న కీలక ప్రశ్నలివే. దక్షిణాదిన గుండెకాయ వంటి ప్రధాన రాష్ట్రం తెలంగాణలో పదేండ్ల విరామం తర్వాత 2023 శీతాకాలంలో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఈ జాతీయపక్షానికి 2024 వేసవి నుంచి అన్నీ ఎన్నికల ఎదురుదెబ్బలే తగిలాయి.**

నాంచారయ్య మెరుగుమాల

దశాబ్దం తర్వాత లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ గుర్తింపు పొందింది. ఎట్టకేలకు రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేత అయ్యారు. గత రెండు పార్లమెంటు ఎన్నికల్లో వరుసగా 44, 52 సీట్లకే పరిమితమైన ఆ పార్టీ పదేండ్లలో జాతీయపక్షమా? ప్రాంతీయపక్షమా? అంటే చెప్పలేని స్థితికి చేరుకున్నది. పార్లమెంటు లోపల, బయటా బాధ్యత గల, శక్తిమంతమైన ప్రతిపక్ష పాత్ర పోషించలేక చతికిలపడింది. 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో ఉన్న రాహుల్‌గాంధీ ఆ పార్టీ బలాన్ని ఆయన కనీసం పది సీట్లు కూడా పెంచలేకపోయారు. అంతేకాదు, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఆరు నెలలకు పైగా ఉండి రాహుల్ గాంధీ సంపాదించి పెట్టినవన్నీ పరాజయాలే.

2023లో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం రాహుల్, కాంగ్రెస్ కలలకు ఊతమిచ్చింది. కర్ణాటక ఎన్నికల్లో మాదిరిగానే ప్రజలను మాయజేసే హామీలతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్పశాతం ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆది నుంచీ ఊహించని రీతిలో ముందుకుసాగుతున్నది. రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావడంతో పాలకపక్షంగా ఆ పార్టీని కొత్త దారిలో పడేసింది. అంతేకాదు, ఈ రెండు చోట్లా పరిపాలన గాడితప్పింది. జనంలో వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతోంది. కర్ణాటకలో సిద్ధరామయ్య నానా పాట్లు పడుతుండగా, తెలంగాణలో రేవంత్‌రెడ్డి తప్పుడు నిర్ణయాలతో తాను ఇబ్బంది పడుతూ.. పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. సొంత రాజకీయ ప్రయోజనాలే తప్ప పార్టీ, ప్రజల క్షేమం ఆయనకు పట్టడం లేదు.

దేశవ్యాప్తంగా ఎంపీ సీట్లు దాదాపు రెట్టింపు కావడంతో పాటు హర్యానాలోని పది సీట్లలో సగం స్థానాలు గెలుపొందడంతో రాహుల్‌గాంధీ అండ్ కోకు ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు నల్లేరుపై బండిలా కనిపించింది. కానీ, కాంగ్రెస్ ఘోర పరాజయం పాలవడం పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇండియా కూటమి పార్టీలకు అక్కడ ఒకటీ అరా సీట్లు కూడా ఇవ్వకపోవడం, ఆప్‌తో సీట్ల సర్దుబాటు లేకపోవడం హస్తం పార్టీని చావుదెబ్బ తీసింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ నేతల్లో కల్పించిన అత్యాశకు హర్యానా ఫలితాలు సగం తెరదింపాయి. ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి జీవితకాల గుణపాఠం నేర్పాయి. మాజీ సీఎంలు ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌ల పార్టీలతో కలిసి కూటమిగా బరిలోకి దిగిన కాంగ్రెస్‌కు 12.42 శాతం ఓట్లు, కేవలం 16 సీట్లు దక్కాయి. కాంగ్రెస్‌కు చివరి కంచుకోటగా పరిగణించే మహారాష్ట్రలో ఇంత తక్కువ సీట్లు రావడం పార్టీ అహంకారానికి గొప్ప ముగింపు. రాజకీయ వ్యాఖ్యాత శేఖర్ గుప్తా విశ్లేషించినట్టు కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం తన ఉనికిని కాపాడుకోవడానికి, పూర్వ వైభవం సంపాదించడానికి మధ్య ఊహల్లో కొట్టుమిట్టాడుతోంది. ఓవైపు మహారాష్ట్రలో ఘోర పరాజయం, మరోవైపు వయనాడ్ ఉప ఎన్నికలో ప్రియాంక గెలుపు కాంగ్రెస్‌కు ఊరటో, కొత్త మలుపునకు సంకేతమో అర్థం కాని పరిస్థితి. పార్లమెంట్‌కు తొలిసారి ఎన్నికయ్యాక అన్న రాహుల్ వెన్నంటి ఉండటమే ప్రియాంక రాజకీయ కార్యకలాపంగా మారింది.

ఈ సంక్షోభ సమయంలో బెళగావిలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం పార్టీకి చూపించే దారిపై కూడా ఎవరికీ పెద్దగా ఆశలు లేవు. మొత్తం మీద లోక్‌సభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్షనేత పదవి దక్కిన 2024 సంవత్సరం ఆ పార్టీకి తీవ్ర ఆశాభంగాన్నే మిగిల్చింది. కర్ణాటక, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన చూస్తే కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం సరికదా, కనీసం ఉనికిని కాపాడుకోవడం కూడా చాలా కష్టమనిపిస్తున్నది. అందుకే, కాంగ్రెస్ నాయకత్వం వద్దు మొర్రో అని ఇండియా కూటమి భాగస్వామ్యపక్షాలు గత కొన్ని వారాలుగా బాహాటంగా చెప్తున్నాయి. పరాజయానికి సంకేతంగా మారిన రాహుల్‌గాంధీ స్థానంలో పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీని తీసుకొస్తేనే ఇండియా కూటమికి మేలనే అభిప్రాయం బలపడుతున్నది. చివరికి కాంగ్రెస్‌కు 140 ఏండ్లు నిండే 2025 సంవత్సరమే దాని భవితవ్యాన్ని తేల్చివేసే పరీక్షా సమయం.

# తెలంగాణను తీర్చిదిద్దిన మహానేత

**తెలంగాణ ఆవిర్భావం, ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధిలో కేసీఆర్ పాత్ర చరిత్రాత్మకమైనది. ఉద్యమ నాయకుడిగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు జీవం పోసి, రాష్ట్రాభివృద్ధికి అంకితమై ఆయన పనిచేశారు. గమ్యాన్ని ముద్దాడేవరకు విశ్రమించవద్దని ఉద్యమ సమయంలో కేసీఆర్ పదే పదే చెప్పేవారు. అదే పంథాను ఆయన అభివృద్ధిలో చూపించారు. అభివృద్ధికి అడ్డం పడినవారందరితో పోరాడి పదేండ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారు.**

చాడ సృజన్ రెడ్డి

1969లో తొలి దశ తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటికీ అది కాలక్రమేణా కనుమరుగైంది. ఆ తర్వాత తెలంగాణ తన అస్తిత్వాన్ని కోల్పోయింది. చాలామందికి తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ప్రత్యేక రాష్ట్రమనే సంగతి కూడా తెల్వకుండాపోయింది. అలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ మళ్లీ పోరు జెండా ఎత్తుకున్నారు. 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించి ఉద్యమానికి కొత్త జవసత్వాలు ఇచ్చారు. ఉద్యమాన్ని కేసీఆర్ శాస్త్రీయంగా, రాజ్యాంగబద్ధంగా నడిపారు. ఏం చేస్తే స్వరాష్ట్రం సాధించవచ్చో క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. నిరాహార దీక్షలు, సభలు, ర్యాలీలు, పార్లమెంటు లోపల, వెలుపల నిరంతరంగా పోరాటం చేస్తూ ఉద్యమాన్ని సజీవంగా ఉంచారు. అంతేకాదు, ఢిల్లీ పెద్దలకు ఉద్యమ సెగ తాకేలా చేసేందుకు అనేకసార్లు రాజీనామా చేసి, ప్రజాక్షేత్రంలో తన బలాన్ని నిరూపించుకున్నారు. ఈ క్రమంలో ఒకటి కాదు, రెండు కాదు తెలంగాణ కోసం సామ దాన దండోపాయాలన్నింటినీ వాడారు. 'నో స్టోన్ లెఫ్ట్ అన్ టర్న్డ్' అనే సూక్తి ఇందుకు సరిగ్గా సరిపోతుంది.

తెలంగాణ ఏర్పాటుతో ప్రజల ఎదురు చూపులు ఫలించాయి. ఉద్యమ నాయకుడిగా నిరూపించుకున్న కేసీఆర్.. పాలకుడిగానూ నిరూపించుకున్నారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోయింది. అయితే, పసికందు తెలంగాణను తన కాళ్ల మీద తాను నిలబడేలా చేయడమంటే మాటలు కాదు. ఉమ్మడి ఏపీ నుంచి వారసత్వంగా వచ్చిన ఎన్నో కష్టాలు ఒకవైపు వెక్కిరిస్తుండగా.. మరోవైపు తెలంగాణను ఫెయిల్యూర్ రాష్ట్రంగా చేయాలని వ్యతిరేక శక్తులు కుట్రలు మొదలుపెట్టాయి. అందులో మొట్టమొదటిది మనకు రావాల్సిన కరెంటును అడ్డుకోవడం. తెలంగాణను అంధకారంలోకి నెట్టాలని, చీకటి రాష్ట్రంగా చిత్రీకరించాలని వేసిన కుయుక్తులను కేసీఆర్ పటాపంచలు చేశారు. అతితక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల కరెంటు సరఫరా చేశారు. కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి తెలంగాణలో మిగులు కరెంటు ఉండేలా ప్రణాళికలు రచించారు. స్వరాష్ట్రంగా ఏర్పడకముందు తెలంగాణ ఒక కరువు ప్రాంతం. ఎర్రటి నేలలతో నిండిన తెలంగాణను పచ్చగా చేయాలంటే మన నీళ్లు మన బీళ్లకు మళ్లాలి.

> **ఉద్యమ నినాదాన్ని నిజం చేసేందుకు వానలు పడాలని ఒకవైపు యజ్ఞాలు చేస్తూనే.. అంతకంటే వేగంగా ప్రాజెక్టుల నిర్మాణాలను కేసీఆర్ చేపట్టారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల విప్లవం జరిగింది. ప్రపంచం అబ్బురపడేలా పాతాళంలో ఉన్న గంగను మోసుకొచ్చే కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వాటికి అనుబంధంగా నీటిని నిల్వ చేయడానికి రిజర్వాయర్లు నిర్మించారు.**

మిషన్ కాకతీయ ద్వారా వేల చెరువులను పునరుద్ధరించారు. కాళేశ్వరం నీళ్లతో ఆ చెరువులను నింపారు. తద్వారా రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయి. బావులు, బోర్లకింది వ్యవసాయం లాభసాటిగా మారింది.



అలా అనతికాలంలోనే తెలంగాణ దేశానికి అమ్మయ్యింది. కేవలం సాగునీరే కాదు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చి జల దారిద్ర్యానికి కేసీఆర్ చెక్‌పెట్టారు. రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం చేసి పెట్టుబడుల ఇబ్బందులను తీర్చారు. అకాలమరణం చెందిన రైతుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోకుండా రైతుబీమా ద్వారా ఆదుకున్నారు. రైతులందరికీ 24 గంటల ఉచిత విద్యుత్తు అందించి సాగును బాగు చేశారు. అసలు వ్యవసాయం చేసుడు అవసరమా? అనేకాడి నుంచి రెండెకరాల రైతు కూడా రాజే అనేకాడికి ఎవుసాన్ని కేసీఆర్ వృద్ధి చేశారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని కుదేలు చేయడానికి ఎన్నో కుట్రలు జరిగాయి. ప్రాజెక్టులకు కేంద్రం నిధులివ్వలేదు. అనుమతులను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి. వాటన్నింటిని తట్టుకొని రైతాంగాన్ని కంటికి రెప్పలా కాచుకున్నారు. పెట్టుబడి నుంచి పంట కొనుగోలు చేసేదాక రైతులకు ఇసుమంతైనా కష్టం కలగకుండా కేసీఆర్ చూసుకున్నారు. ఉద్యోగాలు చేసేటోళ్లు కూడా కాడిపట్టే విధంగా వ్యవసాయాన్ని తీర్చిదిద్దిన కేసీఆర్ నిజంగా అభినవ మహర్షి.

ఉమ్మడి ఏపీలో సంక్షేమం సంగతి దేవుడెరుగు విద్య, వైద్యం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. అందుకే, కేసీఆర్ అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేశారు. దళితులు, గిరిజనులు, బీసీలు, ఇతర వర్గాల పిల్లలు చదువుకునేలా ప్రత్యేకంగా గురుకులాలను నెలకొల్పారు. బస్తీ దవాఖానల నుంచి సూపర్ స్పెషాలిటీల వరకు ఏర్పాటుచేసిన కేసీఆర్ వైద్యరంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల సామాజిక భద్రత పెరిగింది. అంతేకాదు, పరిశ్రమల ఉద్యమమే జరిగిందని చెప్పవచ్చు. టీఎస్-ఐపాస్ లాంటి వినూత్న విధానాల వల్ల పెట్టుబడులు వెల్లువలా వచ్చాయి. తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించిన కేసీఆర్ ప్రజానాయకుడిగా పేరొందారు. ఆయన అవలంబించిన విధానాలు రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టాయి. కేసీఆర్ లేకుంటే ఇంత అభివృద్ధి జరిగేది కాదు. అందుకే, కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి, తెలంగాణ అభివృద్ధి యజ్ఞాన్ని పునఃప్రారంభిస్తారని ఆశిస్తున్నా.

**(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)**

> **తెలంగాణ ఏర్పడకముందు తెలంగాణలో రైతుకు ఎవరూ విలువిచ్చేవారు కాదు. 50 ఎకరాల ఆసాములు కూడా అప్పుల్లోళ్లే. ఊర్ల సేటు పెట్టుబడి పెడితేకాని నారు పోయలేని దుస్థితి. ఎంత పండినా కొనేవాడి కొర్రీలకు బలికావాల్సిందే. తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న ఇలాంటి అనేక చీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కేసీఆర్ ప్రభుత్వం నడుం బిగించింది.**

# డిటెన్షన్ టెన్షన్

డాక్టర్ ఎ.వేణుగోపాల రెడ్డి
99481 06198

**2009 విద్యాహక్కు చట్టాన్ని సవరించిన కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు అమల్లో ఉన్న 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేసింది. తద్వారా 5వ, 8వ తరగతి విద్యార్థులకు డిటెన్షన్ విధానం అమల్లోకి వచ్చింది. టీఆర్ సుబ్రమణియన్ నేతృత్వంలోని కమిటీ సూచనల మేరకు 2018లో విద్యాహక్కు చట్టంలో చేసిన సవరణలను పార్లమెంట్ ఆమోదించింది. ఇటీవల సంబంధిత ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం జారీచేసింది. దీంతో కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ విధానం అమల్లోకి రానున్నది.**

దేశంలోని 16 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇప్పటికే డిటెన్షన్ విధానం అమల్లో ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం నో డిటెన్షన్ విధానం కొనసాగుతున్నది. కొన్ని రాష్ట్రాలు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. 2009 నాటి విద్యాహక్కు చట్టం ప్రకారం 1-8వ తరగతి వరకు నో డిటెన్షన్ విధానం అమల్లో ఉంటుంది. దీని ప్రకారం పరీక్షల్లో ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా పై తరగతులకు ప్రమోట్ చేస్తారు. నో డిటెన్షన్ విధానం వల్ల పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ గణనీయంగా పెరిగింది. డ్రాపౌట్ రేటు తగ్గి, ఉన్నత పాఠశాల స్థాయికి వచ్చే విద్యార్థినుల సంఖ్య పెరిగింది. పిల్లల్లో పరీక్షల పట్ల భయం పోయింది. కానీ, విద్యార్థులు వివిధ తరగతులకు తగ్గట్టుగా సామర్థ్యం సాధించడం లేదని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్), అసెర్ నివేదికలు తేల్చిచెబుతున్నాయి. అంతేకాదు, విద్యార్థుల్లో అభ్యసన పట్ల శ్రద్ధ తగ్గిందని, ఫలితాలకు ప్రాధాన్యం లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించడం లేదని విమర్శకుల వాదన.

నూతన విధానం ప్రకారం 5వ, 8వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో కచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి. ఉత్తీర్ణత సాధించనివారికి రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. రెండవసారి కూడా ఉత్తీర్ణత సాధించకుంటే అదే తరగతిలో కొనసాగిస్తారు. కానీ, 8వ తరగతి పూర్తి చేయకుండా ఏ విద్యార్థినిని బడిలో నుంచి తొలగించకూడదని గెజిట్‌లో కేంద్రప్రభుత్వం పేర్కొన్నది. అయితే, డిటెన్షన్ విధానం తిరోగమన చర్య అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రాథమిక విద్యకూ దూరమయ్యే అవకాశం ఉన్నదని వారు విమర్శిస్తున్నారు. డిటెన్షన్ విధానం వల్ల పిల్లల్లో పరీక్షల పట్ల భయం పెరిగే అవకాశముంది. ఫెయిలైన విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం లేకపోలేదు. మళ్లీ అదే తరగతి చదవాల్సిరావడం వారిలో నిరాసక్తతను పెంచుతుంది. తద్వారా బాలకార్మికులు పెరిగే ప్రమాదం ఉన్నది.

ఈ నేపథ్యంలో నో డిటెన్షన్ విధానంలో ఉన్న లోపాలను అధిగమించేందుకు విద్యావ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలి. పర్యవేక్షణ పెంచాలి. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావాలి. అందుకు విరుద్ధంగా డిటెన్షన్ ద్వారా అవరోధాలు సృష్టిస్తే అసలుకే ఎసరు వస్తుంది. ఈ నేపథ్యంలో డిటెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించాలి.



# ఊరికో అధికారి మళ్లెందుకు?

> **పేదల భూములను కాపాడటం కోసం మునుపెన్నడూ లేనివిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ ప్రక్షాళన చేసింది. అందుకోసం 'ధరణి' పోర్టల్‌ను తీసుకువచ్చింది. కానీ, ధరణిలో కొన్ని లోపాలున్నాయని, వాటిని సరిచేసి 'భూ భారతి' పేరిట సరికొత్త పోర్టల్‌ను తీసుకొస్తున్నామని కాంగ్రెస్ పాలకులు నింగికి నిచ్చెనలు వేసే మాటలు చెప్పున్నారు. అధికార పార్టీ నేతలు చెప్తున్నట్టు అన్ని భూ సమస్యలకు పరిష్కారం ఉండే విధంగా టెక్నాలజీని అభివృద్ధి చేస్తే మరి 'ఊరికో అధికారి మళ్లెందుకు?' అన్న ప్రశ్న సామాన్య ప్రజల్లో తలెత్తుతున్నది.**

ఊరికో అధికారి వల్ల గ్రామాల్లో, మండల కేంద్రాల్లో గతంలో పేద రైతులు తిప్పలు పడేవారు. తమ భూములను తమ పేరు మీదికి మార్చుకోవాలన్నా, వారసత్వ బదిలీ జరగాలన్నా, భూ రికార్డుల్లో తప్పులను సరిచేయాలన్నా గ్రామ పరిధిలో ఉండే రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అవసరమైతే వారిని ప్రసన్నం చేసుకునేందుకు ముడుపులు కూడా ముట్టజెప్పాల్సి వచ్చేది. అట్లయితేనే పనులు పూర్తయ్యే పరిస్థితి నాడు ఉండేది. అందుకే, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసి, సదరు సిబ్బందిని ఇతర విభాగాల్లో సర్దుబాటు చేసింది. బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన చర్యల కారణంగా భూ సమస్యల పరిష్కారం కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. తద్వారా ఎలాంటి పైరవీలు లేకుండానే మండల కార్యాలయాల్లో సాఫీదా పనులు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

కానీ, మళ్లీ ఇప్పుడు నాటి పాత రోజులను తలపించేలా అధికార కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపడుతున్నది. ఉన్నపళంగా రాష్ట్రంలో గ్రామానికో రెవెన్యూ అధికారిని మళ్లీ నియమిస్తామని, వారి ద్వారా భూ సమస్యలు పరిష్కారమయ్యేలా చేస్తామని చెప్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సమస్యల పరిష్కారం దేవుడెరుగు.. మళ్లీ పైరవీల కాలం వస్తే రైతన్నల పరిస్థితి ఏమిటి? గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులు లేకపోయినా భూముల పట్టాలు, భూ సంబంధిత అంశాలు, రైతుల కార్యక్రమాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించింది. మరి ఇప్పుడు అధికార పార్టీ గ్రామానికో అధికారిని నియమించి ఎవరికి లబ్ధి చేకూర్చాలని ఆశిస్తున్నది? ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయకుండా ఇలాంటి నిరూపయోగ పనులు చేయడం సబబు కాదు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక నిర్ణయమే

**- ధని ముదిగొండ**




# ప్రపంచాన్ని వీడినా.. పదిలంగానే ఉంటారు!

**పుట్టినవారు గిట్టక మానరు. కానీ, కొంతమంది జ్ఞాపకాలు, వారి వారసత్వం మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయి. మన దేశ ఆర్థికవ్యవస్థకు సరికొత్త దిశ చూపిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ భౌతికంగా ప్రపంచాన్ని వీడినా ప్రజల జ్ఞాపకాల్లో మాత్రం పదిలంగానే ఉంటారు.**

**- అన్నా హజారే**
**సామాజిక ఉద్యమకారుడు**